సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 14 । జూన్ । 2025



'రక్త' బంధువులు

రక్తదానం చేయడమంటే అదో గొప్పతనం. ఓ మనిషికి నిండు ప్రాణం నిలువడంలోని ఔన్నత్యం. ఇలా మానవత్వం గొప్పతనం గురించి ఎంత చెప్పినా తనివి తీరదు. -8లో



దెబ్బకొట్టిన వాళ్ల రాజకీయ అంతమే లక్ష్యం

రాజకీయంగా మా కుటుంబాన్ని దెబ్బతీసిన నేతలను రాజకీయంగానే అంతం చేయడం లక్ష్యమని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు శపథం చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.250
రెండోరకం	రూ.140	రూ.180



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1570 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	460	460
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 49.940 కిలోలు

న్యూస్‌రీల్

డీఎస్సీ పరీక్షకు 127 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు శుక్రవారం 127 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 8 పరీక్షా కేంద్రాలకు సంబంధించి 1510 మందికి గాను 1415 మంది హాజరు కాగా 95 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం విడతలో 1510 మందికి గాను 1478 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజయ్యారు. మొత్తం 3020 మందికి గాను 2893 మంది హాజరు కాగా 127 మంది గైర్హాజరయ్యారు.

ఏపీ మోడల్ స్కూల్స్ బదిలీల షెడ్యూల్ విడుదల

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ల బదిలీల కోసం ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టనున్నారు. సంబంధింత టీచర్లు తమ దరఖాస్తులను, అభ్యంతరాలను, వెబ్ ఆప్షన్లను షెడ్యూల్ సమర్పించాలి.

- 13వ తేదీ ప్రధానోపాధ్యాయులు, పీజీటీలు, టీజీటీలు తమ స్వీయ ప్రమాణిత వివరాలతో బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అదే రోజు దరఖాస్తుల పరిశీలన కూడా ఉంటుంది
- ప్రవేశిక సీనియారిటి జాబితా మరియు అర్హత పాయింట్ల ఆధారంగా జాబితా వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడుతుంది
- 14వ తేదీన అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలతో వెబ్‌సైట్ ద్వారా సంబంధిత అధికారి వద్దకు సమర్పించాలి. అనంతరం సంబంధిత అధికారి ద్వారా అభ్యంతరాల పరిష్కారం జరిగి తుది సీనియారిటి జాబితా అర్హత పాయింట్లతో వెబ్‌సైట్‌లో ఉంచబడుతుంది. ఆపై ప్రధానోపాధ్యాయులు, పీజీటీలు, టీజీటీలు వెబ్ ఆప్షన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయవలసి ఉంటుంది.
- 15వ తేదీన బదిలీ స్థానాలు కేటాయింపు పక్రియ పూర్తి అవుతుంది.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

రాయచోటి: నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో అదనపు ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలో చోటుచేసుకున్న ముఖ్య నేర సంఘటనలు, వాటిపై చేపట్టిన విచారణలు, పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు,మర్డర్, ప్రాపర్టీ వాహనాల దొంగతనం, 174 సీఆర్‌పీసీ కేసులు, మిస్సింగ్,చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పోలీసు స్టేషన్‌లో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేకశ్రద్ధతో దర్యాప్తు జరపాలన్నారు. దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో మదనపల్లె డీఎస్పీ ఎస్ మహేంద్ర, మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్తరకుమారుని ఉత్తుత్తి హామీలు!

- యువగళం యాత్రలో నోటికొచ్చిన వాగ్దానాలు చేసిన లోకేష్
- ఏడాదైనా ఒక్క హామీ అమలు చేయలేదు
- మదనపల్లె మార్కెట్ దత్తత మాట ఉత్తిదే
- ఎస్సీ, ఎస్టీ తరహా బీసీ చట్టం ఎక్కడ?



మదనపల్లె: అది యువగళం పాదయాత్ర..మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో 2023 మార్చిలో సాగింది. ఈ యాత్రలో అడుగడుగునా ప్రజలు, రైతులు, సంఘాలకు హామీలమీద హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అన్నీ నెరవేర్చేస్తానని అన్నారు. అధికారం వచ్చింది, ఏడాది పూర్తయ్యింది. అయితే ఈ హామీ విషయాన్ని పరిశీలిస్తే పదుల సంఖ్యలో ఇచ్చినవి ఒక్కటంటే ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. ఏడాదిలో తీర్చేస్తానంటూ ఇచ్చిన హామీలపై ప్రజలు అవి ఉత్తరకుమారుని ఉత్తుత్తి హామీలంటూ విమర్శిస్తున్నారు. 2023 మార్చి 14న బి.కొత్తకోట మండలంలో సాగిన పాదయాత్ర, జరిగిన సభల్లో లోకేష్ టమాట రైతులపై ఎనలేని ప్రేమ కురిపించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో టమాట రైతులకు అన్యాయం జరిగిపోతోందంటూ ప్రసంగాలివ్వడమేకాక తన పాదయాత్ర పేజీలో ఇదే రాసుకుని మదనపడ్డారు. అప్పుడంటే ప్రతిపక్షం.. ఇప్పుడు అధికారంలో ఉన్నారు, ఆ సమస్యలపై ఇప్పుడేందుకు స్పందించడం లేదని టమాట రైతులు ప్రశ్నిస్తున్నారు.

బీసీ చట్టం ఎక్కడ..

ఎస్సీ, ఎస్టీ చట్టం తరహాలో బీసీలపై ఎవరైనా దాడులు చేస్తే భయపడేలా బీసీ చట్టం తీసుకొస్తామని లోకేష్ పదేపదే హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ఈ చట్టం తెస్తామని బీసీలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పుడు ఏడాది గడచినా దీని గురించి మాట్లాడటం లేదు. దీనిపై బీసీ సంఘాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. పాలఏకరి కులస్తులకు రాష్ట్రమంతా ఒకలా సర్టిఫికెట్లు ఇస్తామని ప్రకటించారు. తంబళ్లపల్లె నియోజకవర్గ పాదయాత్ర, బీసీ సభల్లో బీసీ వర్గాలకు హామీ ఇచ్చారని, దాన్ని అమలు చేసేందుకు ఇప్పటికి చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



సీటీఎం వద్ద 500 కిలోమీటర్ల శిలాఫలకంలో టమాట రైతులకు ఇచ్చిన హామీలు

మార్కెట్ దత్తత ఒట్టిదే



మదనపల్లె టమాట మార్కెట్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో జరిగిన పాదయాత్రలో పదేపదే ప్రకటించారు. మదనపల్లె రూరల్ మండలం సీటీఎం వద్ద 500 కిలోమీటర్ల శిలాఫలకం ఆవిష్కరించగా అందులోనూ టమాట రైతులను ఆదుకుంటామని హామీలను రాశారు. ధరలు పడిపోతున్నాయి, పెట్టిన పెట్టుబడి రావడం లేదు, దళారులు దోచుకుతింటున్నారని వాపోయారు. దీనిపై అధికారంలోకి వచ్చాక మదనపల్లె మార్కెట్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా, టమాట ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అవేవీ అమలు కాలేదు. టమాట ధరలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం ప్రభుత్వానికి తెలుసు. అయినా హామీలు అమలు చేసి రైతులను ఆదుకోవాలన్న ఆలోచన లేదు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏమైందో..



మదనపల్లె పట్టణ జనాభా రెండు లక్షలు దాటుతోంది. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకొస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఇంతవరకు దీని ఊసేలేదు. పట్టణంలో మురికినీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రణాళికాబద్ధమైన విధానం లేదు. దీంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ వస్తే ప్రయోజనమని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే హామీ హామీగానే మిగిలిపోయింది.

లోకేష్ హామీలు..

- విశ్వకర్మ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తాం.
- టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెరలకు క్వారీలు అప్పగిస్తాం.
- దామాషా ప్రకారం అన్ని బీసీ కులాల నిధులు కేటాయించి ఆదుకుంటాం.
- మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తాం.
- బడగు విద్యార్థుల కోసం స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేస్తాం.
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాలు అందిస్తాం
- మైనార్టీలకు ప్రత్యేక పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తాం.
- సయ్యద్, పఠాన్‌లను బీసీ జాబితాలో చేర్చే అంశంపై నిర్ణయం తీసుకొంటాం.
- వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు కల్పిస్తాం.
- టమాట మార్కెట్‌లో దళారీ వ్యవస్థ, జాక్‌పాట్ విధానం రద్దుకు కృషి చేస్తాం.
- టమాట ఆధారిత పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజీలు, పల్ప్ పరిశ్రమలు స్థాపిస్తాం.
- ఉమ్మడి చిత్తూరుజిల్లాలో క్రీడా విశ్వవిద్యాలయం ప్రారంభిస్తాం.
- తంబళ్లపల్లెలో ఉపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.

బీసీ చట్టం తేవాలి



అధికారంలోకి వచ్చిన ఏడాదిలో బీసీ చట్టం తీసుకొస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. చట్టం తెచ్చేదిశగా ఇంకా అడుగులు పడలేదు. మాట ప్రకారం బీసీలకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలి. ఈ చట్టం రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అందరూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. బీసీల భద్రత, భవిష్యత్ తరాల సంక్షేమ దృష్టిలో పెట్టుకుని బీసీ వర్గాలు స్పందించి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి చట్టం కోసం కృషి చేయాలి.

–మనిగే భాస్కర్‌నాయుడు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు

మాట నిలుపుకోవాలి



మదనపల్లె టమాట మార్కెట్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామన్న మాటను లోకేష్ నిలబెట్టుకోవాలి. రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోతున్నారు. ధరలు పతనమైనా ప్రభుత్వ సహాయం లేదు. మద్దతు ధర లేదా గిట్టుబాటు ధరలు నిర్ణయించాలి. టమాట ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి, కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం చేపట్టి మాట నిలుపుకోవాలి. చేతల్లో రైతుల సంక్షేమం కోసం పని చేయాలి.

–నిస్సార్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మదనపల్లె

ఏడాదిపాలనలో చిల్లిగవ్వ అయినా తెచ్చారా?

- సమీక్షా సమావేశంలో అవాస్తవాలు మాట్లాడితే ఎలా..?
- ఎమ్మెల్యేను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

మదనపల్లె రూరల్: అధికారపార్టీ ఎమ్మెల్యేగా, మున్సిపాలిటీకి ఏడాదికాలంలో ఏరోజైనా స్పెషల్ గ్రాంట్ కింద చిల్లిగవ్వ తెచ్చారా అంటూ ఎమ్మెల్యే షాజహాన్ బాషాను, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయంలో, కమిషనర్ ఛాంబర్‌లో కౌన్సిలర్లు లేకుండా ఎమ్మెల్యే షాజహాన్ బాషా సమీక్షా సమావేశం నిర్వహించి, అవాస్తవాలు మాట్లాడిన వైనంపై ధ్వజమెత్తారు. శుక్రవారం మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ... రెండురోజుల క్రితం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ...ఒక్కోవార్డుకు 30లక్షల చొప్పున ఇస్తానన్నారని, నిధులు స్పెషల్ గ్రాంట్ నుంచి ఇస్తారా..లేక జనరల్ ఫండ్ నుంచి ఇస్తారా ? ప్రజలకు వివరణ ఇవ్వాలని, జనరల్ ఫండ్‌కి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కావాలని, ఇందులో మీరు ఇచ్చేదేముందని మనూజారెడ్డి ప్రశ్నించారు. నాలుగేళ్లుగా పట్టణంలో అభివృద్ధి జరగలేదని మాట్లాడారని, ఎమ్మెల్యే హోదాలో ఏడాదికాలంగా మీరు ప్రారంభోత్సవాలు చేస్తున్న రోడ్లు, బోర్లు, డ్రైనేజీ కాలువలు...వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కౌన్సిల్ ఆమోదంతో చేసినవేనని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్తుచేశారు. సీఎఫ్ఎంఎస్ మహమ్మారి పీడ ఏప్రిల్ నుంచి విరగడైపోతుందని, గ్రీన్‌ఛానల్ ద్వారా కమిషనర్ చెక్‌పవర్‌తో తక్షణమే బిల్లుల చెల్లింపులు జరిగిపోతాయని ఏడాదిగా ఎమ్మెల్యే చెపుతూనే ఉన్నారని, ఇప్పటివరకు జరిగిన దాఖలా లేదన్నారు. మున్సిపల్ ట్రాక్టర్లకు డీజల్ బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ఉన్న ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ ఖజానాలో మున్సిపాలిటీకి చెందిన 40 కోట్లు ఉన్నాయని, వాటిని ఇప్పిస్తే..ప్రతి వార్డుకు కోటికిపైగానే ఖర్చు చేసేందుకు పాలకవర్గం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు తేకుండా అభివృద్ధి చేసేస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. 2021 మార్చి 18న మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ కొలువుదీరినప్పటి నుంచీ ఇప్పటివరకు రూ.93కోట్ల 4 లక్షలతో 861 పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. వాటిలో 20కోట్ల 76లక్షలకు చెందిన 246 పనులు పూర్తిచేశామన్నారు. రూ.2కోట్ల12లక్షల పనులు జరుగుతున్నాయన్నారు. రూ.7.5 కోట్లతో 60 పనులకు కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు జరిగి పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నటువంటి ఎమ్మెల్యే..మున్సిపాలిటీలో పాలకవర్గం లేకుండా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం ఎంతవరకు సబబన్నారు. ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన 40 కోట్లు ఇప్పించండని ఎమ్మెల్యేను కౌన్సిల్ సమావేశంలో కోరితే...ఆయన హేళనగా 40 కాదు...400 కోట్లు మంజూరుచేయిస్తానని గొప్పలు చెప్పారని, అయితే ఇప్పటివరకు పైసా తేలేకపోయారన్నారు.ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీం అస్లాం మాట్లాడుతూ...సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే...పట్టణంలో చేయాల్సిన అభివృద్ధిపై ప్రస్తావించకుండా కౌన్సిలర్లు జీరో అంటూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ అందిన సంక్షేమ పథకాలను, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం ద్వారా వార్డుల్లో కౌన్సిలర్లు హీరోలుగా తలెత్తుకుని తిరుగుతున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు పెరవలిరాజేష్, ప్రసాద్‌బాబు, మేస్త్రీ శ్రీనివాసులు, ఎం.లత, రేణుక, రామిశెట్టిశివ, రహీం, గుండ్లూరురఫీ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

గాలివీడు: ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. మెగా యోగా క్యాంపెయిన్ లో భాగంగా ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం,ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా టూరిజం డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగభూషణంతో కలసి కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం మండలంలోని వెలిగల్లు ప్రాజెక్ట్ పార్క్ లో అధికారులు, ప్రజలతో కలసి యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను నిరంతర అభ్యాసంగా మార్చుకోవాలన్నారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

కొమ్మినేనికి బెయిల్ బాబుకు చెంపపెట్టు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



సాక్షి రాయచోటి: సీనియర్ జర్నలిస్టు, విశ్లేషకులుగా ఉంటున్న కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం తగదని సుప్రీం కోర్టు బెయిల్ ఇవ్వడం సీఎం చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతిసారి జర్నలిస్టులే కాకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు నమోదు చేయించి వేధిస్తున్నారన్నారు. ఎప్పుడూ పరిస్థితులు ఒకేలా ఉండవని...తప్పు చేయని వారిని వేధించాలనుకోవడం సబబు కాదని, అందుకు దేవుడే ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తున్నాడన్నారు. ఎప్పుడుకూడా ప్రభుత్వాలు కక్షపూరిత రాజకీయాలు చేయకూడదని, ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేసి తర్వాత సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించడం మంచిదని హితవు పలికారు. కొమ్మినేనిపై పెట్టిన అక్రమ కేసు పట్ల సుప్రీం కోర్టు సీరియస్ కావడంతోపాటు బెయిలు మంజూరుచేస్తూ ఇచ్చిన తీర్పు హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. చంద్రబాబు సర్కార్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ లాంటి అమలు చేయకుండా ఎంతసేపు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు చేసింది ఏమి లేదని ఆయన దుయ్యబట్టారు. వైఎస్ జగన్ హయాంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందుతుండడంతో సంతోషంగా గడిపారన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేధింపులు, అక్రమ కేసులు మానుకుని ప్రజల సంక్షేమాన్ని చూడాలని ఆయన హితవు పలికారు.

మోగిన రైల్వే ఎన్నికల నగారా

- రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- అభ్యర్థుల ఎంపికలో నేతలు కసరత్తు
- 19 నుంచి నుంచి నామినేషన్లు, 7న పోలింగ్



నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్



నందలూరు (రాజంపేట): ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో రైల్వే పరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గానికి ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు గురువారం రాత్రి గుంతకల్ రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజరు నరసింహారావు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ప్రధానంగా జూలై 1న పాకాల, 4న రేణిగుంట, 7న నందలూరుకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కడపకు త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి, ఆరుగురు కమిటీ సభ్యుల పదవుల కోసం అభ్యర్థులు పోటీపడున్నారు. అలాగే మేనేజ్‌మెంట్ సభ్యులుగా వివిధ శాఖల నుంచి అధికారులు నియమితులవుతారు.


ఆంగ్లో ఇండియన్స్ నుంచి ..

బ్రిటీషు రైల్వేపాలకుల హయాం నుంచి నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్ వైభవంగా వెలుగొందింది. ఆంగ్లో ఇండియన్స్‌కు చెందిన డాయల్‌దొర, హోప్రిన్‌దొరతోపాటు మరి కొంత మంది కుటుంబాలు, వందలాది మంది కార్మికులు సభ్యులుగా కొనసాగారు. స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఉన్నప్పటి నుంచి వివిధ విభాగాలకు చెందిన కార్మికులు, వారి కుటుంబాల కోసం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను 1920 కోసం శారీరక, మానసిక, విజ్ఞాన, క్రీడ, కళారంగానికి సంబంధించి అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రత్యేక రైల్వే టెన్నిస్ కోర్టులో శిక్షణ పొందిన టెన్నిస్ క్రీడాకారులు జోన్, డివిజన్ స్థాయిలో రాణించేవారు. కళా సమితి తరఫున రాష్ట్ర స్థాయిలో నాటక రంగస్థలం పోటీలు నిర్వహించే వారు. ఆ సందర్భంగా అనేక మంది సినీనటులు ఇక్కడికి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. అలాగే రైల్వే టెన్నిస్‌కోర్టును వేదికగా చేసుకొని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన ప్రసంగాన్ని ఇప్పటికీ రైల్వే పూర్వీకులు గుర్తు చేసుకుంటున్నారు.

పోటాపోటీగా తలపడనున్న మజ్దూర్, సంఘ్

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలలో గెలిచేందుకు సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్‌లు పోటీపడుతున్నాయి. దీంతో అభ్యర్థుల ఎంపికలో నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆధిపత్యం సాధించేందుకు ఈ కార్మిక సంఘాలు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో నందలూరులో రైల్వే ఎన్నికల వేడి రాజుకుంది.

ఎన్నికల ప్రక్రియ ఇలా..



12న సభ్యుల జాబితా విడుదల చేయనున్నారు. 16న సభ్యత్వాల వినతుల స్వీకరణ ఉంటుంది. 17న తుది జాబితా విడుదల చేస్తారు. 19 నుంచి 23 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 25న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 27న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 28న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. 7న పోలింగ్ ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి 4 వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. అదే రోజు ఫలితాలను ప్రకటిస్తామని డీపీఓ ఎన్నికల షెడ్యూల్‌లో తెలియజేశారు.

డీజీపీని కలిసిన ఎస్పీ



రాష్ట్ర డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి: రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తను జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు కలిశారు. రాష్ట్ర డీజీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం అన్నమయ్య జిల్లా ఎస్పీని డీజీపీ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితులపై డీజీపీ ఆరాతీశారు.

క్లుప్తంగా

ఆకేపాటికి వైఎస్ జగన్ పరామర్శ

రాజంపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డిని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం వైఎస్ జగన్ ఫోన్‌లో ఆకేపాటిని పలుకరించారు. కాగా ఎమ్మెల్యే మేనమామ చిన్నరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలు గురువారం సాయంత్రం రేణింతల గ్రామంలో నిర్వహించారు. చిన్నరెడ్డి మరణించిన సమాచారం తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్‌జగన్ ఆకేపాటిని ఫోన్ చేశారు. చిన్నరెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

సుండుపల్లె : భర్త మందలించాడని నేతి చంద్రకళ (23) అనే గర్భిణీ మహిళ ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... పెద్దినేని కాలువ గ్రామపంచాయతీ బేరిపల్లె గ్రామానికి చెందిన నేతి చంద్రకళ గురువారం ఉదయం ఆలస్యంగా టిఫిన్ చేసి చిన్న పిల్లవానికి పెట్టింది. దీంతో మృతురాలి భర్త నాగ సునీల్ మందలించడంతో గురువారం రాత్రి ఆమె ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతురాలి అన్న నేతి రామాంజులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కారు ఢీకొని రైతు మృతి


సుబ్రమణ్యం నాయుడు (ఫైల్)

ఓబులవారిపల్లె : రెడ్డిపల్లి చెరువుకట్ట సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం కారు ఢీకొనడంతో పిడికిటి సుబ్రమణ్యం నాయుడు (65) అనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు.. చిన్నఓరంపాడు, దిగువపల్లి గ్రామానికి చెందిన పిడికిటి సుబ్రమణ్యం నాయుడు ప్రతిరోజూ వలే ఉదయాన్నే పొలం వద్దకు పనుల నిమిత్తం వెళ్లాడు. అక్కడ నుండి తిరిగి జాతీయ రహదారిపైకి వస్తుండగా హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న కారు వేగంగా టీవీఎస్ ఎక్సల్‌పై రోడ్డుపైకి వచ్చిన సుబ్రమణ్యం నాయుడును బలంగా ఢీ కొంది. దీంతో తలకు తీవ్రంగా గాయం కావడంతో సుబ్రమణ్యం నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు నడుపుతున్న శ్రావణ్ లాల్‌ను రైల్వేకోడూరు పట్టణంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పి. మహేష్ నాయుడు తెలిపారు.

రక్తబంధువులు

- ఆపద సమయాన ప్రాణాలను కాపాడే గొప్పదానం రక్తదానం
- రక్తదానంపై యువకుల్లో పెరిగిన అవగాహన
- రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్న యువత
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం





రక్తదానం చేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు (ఫైల్)

రాజంపేట టౌన్/ మదనపల్లె సిటీ : ఏ వస్తువునైనా మనిషి తన తెలివి తేటలతో తయారు చేయగలడు. డబ్బుతో వాటిని కొనుగోలు చేయగలడు. కాని మనిషి రక్తాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యం కాదు. చాలా మందికి రక్తం అందక విలువైన ప్రాణాలు కోల్పోతుంటారు. అలాంటి వారికి సకాలంలో మన శరీరంలో జీవధారగా ప్రవహించే రక్తాన్ని అందిస్తే ప్రాణాలు నిలుస్తాయి. వెలకట్టలేని రక్తాన్ని కేవలం మరో వ్యక్తి నుంచే సేకరించాలి. అందుకే రక్తదానానికి అంత ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం రక్తదానంపై విద్యావంతుల్లో, యువకుల్లో కొంతమేర అవగాహన పెరిగింది. అందువల్ల అవసరమైన వారికి రక్తదానం చేసేందుకు అనేక మంది ముందుకు వస్తున్నారు. రక్తదానం ఆవశ్యక్త గురించి నిరక్ష్యరాస్యులకు, గ్రామీణ ప్రాంత ప్రజల్లో చైతన్యం కల్పిస్తే రక్తం దొరకదు అన్నమాట వినపడదు. ఫలితంగా రక్తం దొరకక ఏ ఒక్కరు కూడా మృత్యువాత పడే పరిస్థితి ఉండదు. నేడు రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

రక్తదానమంటే ప్రాణాలు కాపాడటమే..

రక్తదానం అన్నది వెలకట్టలేనిది. రక్తదానం అన్న మాటను చాలా మంది తరచూ వింటూనే ఉంటారు. కాని సమయానికి రక్తం దొరక్కుంటే మనిషి ప్రాణాలను కూడా గాలిలో కలిసిపోతాయి. అదే రక్తం సరైన సమయానికి దొరికితే ఓ నిండు ప్రాణం నిలబడుతుంది. రక్తదానం అన్నది ఒకరి ప్రాణాలను రక్షించడంలో సహాయపడే గొప్పదానం. రక్తం యొక్క ఆవశ్యకత గురించి చాలా మందికి తెలిసినప్పటికి ఇప్పటికి రక్తదానం చేసేందుకు చాలా మంది వెనకడుగు వేస్తూనే ఉన్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. రక్తదానం చేయడం వల్ల బలహీనత ఏర్పడుతుందన్న అపోహ చాలా మందిలో ఉంది. ఇక నిరక్ష్యరాస్యులు, గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ అపోహ బలంగానేవుంది. అయితే ఆరోగ్యవంతులు రక్తదానం చేస్తే మరింత ఆరోగ్యవంతులుగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే రక్తదానం వల్ల అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.

రక్తదానం వల్ల ప్రయోజనాలు

రక్తదానం వల్ల ముఖ్యంగా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలో పాత రక్తం పోయి కొత్తరక్తం ఉత్పత్తి అవుతుంది. బ్లడ్ ప్లాస్మా కూడా పునరుజ్జీవం పొంది ల్యూకో సైట్‌ల పెరుగుదలకు సహాయపడుతుంది. ఈ ల్యూకోసైట్‌లు వివిధ అనారోగ్యాల నుంచి రక్షించే రోగనిరోధక కణాలు. ఈకారణంగా ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తదానం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. క్యాన్సర్ వ్యాధిని దూరం చేస్తుంది. రక్తదానం చేస్తుండటం వల్ల శరీరంలో ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే గుర్తించవచ్చు.

అరుదైన బ్లడ్ గ్రూపులు ఇవే..

బ్లడ్ గ్రూపుల్లో కొన్ని అరుదైన గ్రూపులు ఉన్నాయి. ఇందులో ఏనెగెటివ్, బీనెగెటివ్, ఏబీనెగటివ్, ఏబీపాజిటివ్ వంటి వి అరుదైన బ్లడ్ గ్రూపులు. ఈగ్రూపు బ్లడ్ కొంతమందిలోనే ఉంటుంది. ఇలాంటి బ్లడ్ గ్రూపుగల వారు రక్తదానం చేసేందుకు ఎప్పుడు ముందుంటే కొన్ని సమయాల్లో మనిషి ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా నిలబడతాయి.

రక్తదానం కోసం వాట్సాప్ గ్రూపులు..

ప్రస్తుతం కొంత మంది యువకులు రక్తదానం చేసేందుకు చాలా చొరవ చూపుతున్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఉండటంతో కొంత మంది సామాజిక దృక్పదంగలవారితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి తద్వారా అవసరమైన వారికి రక్తదానం చేయిస్తున్నారు. అంతేకాక ఎవరికైనా ఫలానా బ్లడ్ గ్రూపు కావాల్సివుందని వివిధ రకాల గ్రూపుల్లో మెసెజ్ పెట్టినా ఆ మెసెజ్‌ను వైరల్ చేస్తున్నారు. ఫలితంగా అవసరమైన వారికి రక్తం అందుతుంది. అందువల్ల ప్రస్తుతం వాట్సాప్ గ్రూపుల వల్ల కూడా కాస్త సులువుగానే అవసరమైన వారికి రక్తం అందుతుంది.

రక్తదానం చేసేందుకు వీరు అర్హులు

- ఆరోగ్యవంతులుగా ఉండే 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలలోపు వయస్సు వారు రక్తదానం చేయవచ్చు.
- 50 కిలోల బరువు కలిగివుండాలి
- హిమోగ్లోబిన్ శాతం 12.5 ఉండాలి
- టైఫాయిడ్, మలేరియా ఇతర వ్యాధులు సోకిన వారు నయమైన తరువాత ఆరు నెలల అనంతరం రక్తదానం చేయవచ్చు.
- రక్తదానం చేసేవారి నుంచి కేవలం 300 మిల్లీలీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.
- రక్తాన్ని సేకరించే ముందు అన్నిరకాల రక్తపరీక్షలు చేస్తారు. అలాగే వైద్యులు రక్తదాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.

మొబైల్ ఫోన్‌నే ఓ బ్లడ్‌బ్యాంక్‌గా చేసుకోవచ్చు

మొబైల్ ఫోన్‌నే ఓ బ్లడ్‌బ్యాంక్‌గా కూడా సృష్టించుకోవచ్చు. అదెలా అంటే....మొబైల్ ఫోన్‌లో స్నేహితులు, సన్నిహితులు, బంధువుల నెంబర్‌లు ఫీడ్ చేసుకునే సమయంలోనే వారి బ్లడ్ గ్రూపు కూడా ఫీడ్ చేసుకుంటే అదే ఓ బ్లడ్‌బ్యాంక్ అయ్యే అవకాశముంది. ఎవరికైనా ఏదైనా గ్రూపుకు సంబంధించి బ్లడ్ అవసరం అని తెలియగానే మన మొబైల్‌ఫోన్‌లో ఆ గ్రూపుబ్లడ్ వారికి ఫోన్‌చేసి రక్తదానం చేసే ఏర్పాటు చేయించవచ్చు.

శతాధిక రక్తదాత



పై ఫోటోలోని వ్యక్తి చిట్వేలికి చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్. దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం బెంగుళూరులో తన తల్లి ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడిన సందర్భంగా ఆమెకు రక్తం అవసరం కావడంతో 'రక్తం కోసం' వేణుగోపాల్‌తో పాటు ఆయన సోదరులు డాక్టర్ చంద్రశేఖర్, శ్రీనివాసులు నడిరోడ్డుపై బిక్షాటన చేశారు. అప్పుడు రక్తం విలువ ఏమిటన్నది వేణుగోపాల్ సోదరులైన చిట్వేలి మాజీ సర్పంచ్ డాక్టర్ చంద్రశేఖర్, చిట్వేలి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న శ్రీనివాసులు తెలుసుకున్నారు. అప్పటి నుంచి డాక్టర్ చంద్రశేఖర్ తన తోబుట్టువులను, ఆయన పిల్లలను రక్తదాతలుగా మార్చారు. అందులో భాగంగా డాక్టర్ చంద్రశేఖర్ 51 సార్లు రక్తదానం చేయగా, శ్రీనివాసులు 19 సార్లు రక్తదానం చేశారు. ఇప్పటి వరకు ఆయన 110 సార్లు రక్తదానం చేశారు. అలాగే వేణుగోపాల్ చిట్వేలి మండలంలో 458 మందిని రక్తదాతలుగా మార్చారు. వీరంతా ప్రతి మూడునెలలకో మారు రక్తదానం చేస్తుండటం విశేషం.

పత్రికలో వచ్చిన కథనంతో రక్తదాతగా మారారు



పై ఫోటోలోని వ్యక్తి పేరు రాఘవరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి. 1989వ సంవత్సరంలో రాజంపేట పట్టణ శివారుల్లోని పోలి చెరువుకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి రక్తం అందక మృతి చెందాడు. ఈవిషయాన్ని పత్రికల్లో చదివిన వెంకటేశ్వర్‌రెడ్డిని కలిచివేసింది. అప్పుడే ఎవరికి అవసరమైన రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఏ పాజిటివ్ బ్లడ్ గ్రూపుగల వెంకటేశ్వర్‌రెడ్డి 20 సంవత్సరాల వయసు నుంచి రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటి వరకు ఆయన 64 సార్లు రక్తదానం చేశారు. అవసరమైన వారికి ఆయన రక్తదానం చేయడమే కాక తన స్నేహితులు, బంధువుల ద్వారా కూడా రక్తదానం చేయిస్తుంటారు. ఈసేవా కార్యక్రమం వెలకట్టలేని ఆనందాన్ని, సంతృప్తిని ఇస్తుందని ఆయన చెబుతున్నారు.

తెలిస్తే చాలు రక్తదానం చేస్తాడు



ఈ ఫోటోలోని యువకుడు రాజంపేట మండలం తుమ్మల అగ్రహారంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పసల రాజ. ప్ర స్తుతం వర్క్‌ఫ్రంహోం ద్వారా పనిచేస్తున్నాడు. చేస్తున్నాడు. ఓ పాజిటివ్ బ్లడ్ గ్రూపు గల రాజ ఎవరికి రక్తం అవసరమైనా ప్రతి మూడు నెలలకు ఓమారు ఇస్తున్నాడు. రక్తం అవసరమని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నా రాజ వెంటనే రక్తం అవసరమైన వారి వద్దకు వెళ్ళిపోతాడు. రక్తం దొరకక ఎవరు కూడా మృతి చెందకూడదని, అందువల్ల తనవంతు ఉడతా భక్తిగా ఈసహాయం చేస్తున్నట్లు రాజ చెబుతున్నాడు.

ఇవ్వడమే కాదు... ఇప్పిస్తారు



రక్తం ఇవ్వడమే కాదు. అవగాహన కల్పించి ఇతరులతో ఇప్పించడం కూడా గొప్ప విషయమే. ఈ విషయంలో రెండో కోవకు చెందుతారు అబూబకర్‌సిద్దిక్. మదనపల్లె పట్టణంలో హెల్పింగ్‌మైండ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. తరచూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా అత్యవసర సమయంలో ఎవరైన ఫోన్ చేస్తే వారికి రక్తం ఇస్తారు. ఇప్పటి వరకు 38 సార్లు రక్తదానం చేశారు. సంస్థ తరపున పదేళ్లల్లో సుమారు 18వేల మందితో రక్తదానం చేయించారు.

చిరు వ్యాపారి.. రక్తదానంలో మేటి



మదనపల్లె పట్టణంకు చెందిన హర్షద్‌అలీ చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. స్నేహితుడికి అనారోగ్యం పాలవడంతో ఓ గ్రూపు రక్తం అవసరం కావడంతో దొరకపోవడంతో ఇబ్బందులు పడ్డాను. అప్పటి నుంచి రక్తంతో ఎవరూ ఇబ్బందులు పడకూడదని రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 44 సార్లు రక్తదానం చేశారు.

ఆపద వస్తే.. వాలిపోతాడు



స్వర్ణకారుడిగా పని చేస్తూ స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నాడు మదనపల్లె పట్టణానికి చెందిన ఢంకనాచారి. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసే తృప్తిలో ఎక్కడా ఉండదని నమ్మిన యువకుడు. బ్లడ్ బ్యాంకులో తన ఫోన్ నెంబర్ ఇచ్చాడు. అత్యవసరమైతే ఫోన్ చేస్తే చాలు రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటి వరకు 45 సార్లు రక్తదానం చేసి అందరి మన్ననలు పొందాడు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌పై విచారణ జరపాలి

ప్రొద్దుటూరు : తప్పుడు పద్ధతిలో ఉద్యోగం పొందిన అసిస్టెంట్ లైన్‌మెన్ మైలవరం సాయికుమార్‌పై విచారణ జరపాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని సౌత్ సెక్షన్‌లో సాయికుమార్ విధులు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయన తన తండ్రి మైలవరం శేఖర్ మరణానంతరం కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందారని తెలిపారు. ఆయన ఏవిధంగా మరణించారన్న విషయంపై సాక్ష్యాధారులు లేకుండా, డెత్ సర్టిఫికెట్ లేకుండా ఉద్యోగం పొందారన్నారు. ఈ విషయంపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ విషయంపై ఈఈని సాక్షి వివరణ కోరగా గోసా మనోహర్ ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని ఏడీఈకి బాధ్యతలు అప్పగించామన్నారు.

దెబ్బకొట్టిన వాళ్ల రాజకీయ అంతమే లక్ష్యం

- టీడీపీ నేతలపై సుగవాసి ప్రసాద్‌బాబు ఆరోపణలు
- రాయచోటి టీడీపీలో బట్టబద్దలైన విభేదాలు


పాలకొండ్రాయుడు సంస్మరణ సభలో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటి : రాజకీయంగా మా కుటుంబాన్ని దెబ్బతీసిన నేతలను రాజకీయంగానే అంతం చేయడం మా లక్ష్యమని దివంగత మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు చిన్న కుమారుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు శపథం చేశారు. శుక్రవారం సాయంత్రం చిన్నమండెం మండల కేంద్రంలో సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభ సాక్షిగా ప్రసాద్‌బాబు రాజకీయ శంఖారావం పూరించారు. రాజంపేట టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన సుగవాసి సుబ్రమణ్యం ఆ పార్టీకి రాజీనామా చేయడంతో జిల్లా కేంద్రమైన రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో ఆ పార్టీలో వేడి పుంజుకుంది. సంస్మరణ సభలను తన రాజకీయ వేదికగా మార్చుకున్న సుగవాసి ప్రసాద్‌బాబు తాను పార్టీలోనే ఉంటానంటూ ఆ పార్టీ నేతలపై విమర్శల బాణం ఎక్కుపెట్టారు. ప్రసాద్‌బాబు విమర్శలతో రాయచోటి టీడీపీలో రెండు వర్గాలుగా విడిపోయి వర్గ విభేదాలు బట్టబయల య్యాయి. రాజంపేట అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన సోదరుడు సుగవాసి సుబ్రమణ్యంను పార్టీలోని నాయకులే వెన్నుపోటు, కుట్ర రాజకీయాలతో ఓడించారన్నారు. టీడీపీ ఆవిర్భావం ముందు నుంచి రాజకీయాల్లోకి వచ్చిన మా తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు తన రాజకీయ ప్రయాణంలో ఎక్కడా మోసాలు చేయలేదన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నడవలేని స్థితిలో ఉన్న మా తండ్రి టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారంటూ నర్మగర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా కుటుంబాన్ని రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. ఏదేమైనా కూటమి పాలనలో భాగస్వాములైన టీడీపీలో రాయచోటి, రాజంపేట నియోజకవర్గ విభేదాలు భగ్గుమన్నాయి.

అభిమానుల కోసం 2029లో పోటీ చేస్తా

చిన్నమండెం : సుగవాసి అభిమానులు, కార్యకర్తల అభిమానంతో 2029 ఎన్నికల్లో పోటీ చేస్తానని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి చిన్నమండెం మండల కేంద్రంలో సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ్రాయుడు చిత్రపటానికి సుగవాసి ప్రసాద్‌బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయచోటి నియజకవర్గంలో ఏ ప్రాంతం వెళ్లినా పాలకొండ్రాయుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలే కనిపిస్తున్నాయని తెలిపారు. తండ్రి అడుగుజాడల్లోనే నడుచుకుంటానని.. అధికారం ఉన్నా లేకున్నా మీ కుటుంబ సభ్యుడిలో ఒక్కడిలా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త ముంబై ఏజాస్‌ఖాన్, నాయకులు తౌహీద్‌ఖాన్, రహమతుల్లా, సాయిపీర్, బాలచంద్ర యాదవ్, నాగభూషణం, రమేష్, పార్టీలకతీతంగా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను బావిలోకి వదిలేశారు


- చోరీకి ప్రయత్నించారా.. కావాలనే వదిలేశారా



దెబ్బతిన్న ట్రాక్టర్ ఇంజన్, క్రైన్ సహాయంతో బయటకు తీస్తున్న ట్రాక్టర్

పెద్దమండ్యం : ఇంటికి సమీపంలోని చెట్టుకింద ఉంచిన ట్రాకర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గ్రామానికి సమీపంలోని బావిలోకి వదిలేశారు. కాగా ట్రాక్టర్‌ను చోరీ చేసేందుకు ఎవరైనా ప్రయత్నించారా.. లేక వ్యక్తిగత కక్షలతో ట్రాక్టర్‌ను బావిలోకి వదిలేశారా అనేది తెలియరావడం లేదు. మండలంలోని బండమీదపల్లెలో శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గర్నిమిట్ట రెడ్డెప్ప కుమారుడు నాగార్జున (30) ట్రాక్టర్‌ను నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. ఇదివరకు గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఇతను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఇటీవల ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి పొలం పనులు, ఇతర బాడుగలకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం ట్రాక్టర్‌ను ఇంటికి సమీపంలోని చెట్టుకింద రోజు మాదిరిగానే ఉంచి ఇంట్లో నిద్రించాడు. అయితే తెల్లవారే సరికి చెట్టుకింద ట్రాక్టర్ లేక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. గ్రామానికి సమీపంలోని గెంతోళ్లబావిలో ఇంజిన్ ఆయిల్ తేలి ఉండడాన్ని చూసి బావిలో ట్రాక్టర్ ఉన్నట్లు గుర్తించారు. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో రెండు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తోడేశారు. అనంతరం క్రైన్, జేసీబిల సహాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు. బావి లోతు ఎక్కువగా ఉండడంతో ఇంజిన్ పూర్తిగా దెబ్బతినిపోయింది. ఎవరు చేశారో.. ఎందుకు చేశారో.. తనకు ఎవరు శత్రువులు లేరని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. నా జీవనాధారాన్ని దెబ్బతీసేందుకు ఇలా చేశారని బాధితుడు వాపోయాడు. ట్రాక్టర్‌ను బావిలో వదిలేసి విషయమై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు అతను తెలిపారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి


కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

నందలూరు : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో మృతిచెందిన వారికి శుక్రవారం రాత్రి అరవపల్లిలోని ఆర్ఎస్ రోడ్డులో లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మన్యం రామమోహన్, వాకర్స్ కార్యదర్శి ఉప్పుశెట్టి సుధీర్ మాట్లాడుతూ ప్రమాదం ఊహించని పరిణామం అని, ప్రతి ఒక్కరూ సంఘటితంగా సంతాపం తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మృతిచెందిన వారి కుటుంబీకులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో విభా ఏరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కుర్ర మణియాదవ్, మోడపోతుల రాము, గురుప్రసాద్, గండికోట కృష్ణకుమార్, కానకుర్తి వెంకటయ్య, కొత్తపల్లి రాజాచారి, తాటి సుబ్బరాయుడు, ఆంజనేయులు, మేస్త్రీ శంకర్, సయ్యద్ అమీర్, మధు, పుత్త వెంకటేష్, కొండిశెట్టి సుదర్శన్, ప్రదీప్, పెంచలయ్య, సుబ్రమణ్యం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు


చిట్టిబోయనపల్లెలోని ప్రభుత్వభూమిలో రాత్రికి రాత్రే మొక్కలు నాటిన దృశ్యం


మొక్కలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

- హెచ్చరిక బోర్డులను పీకేసిన కబ్జాదారులు
- తొలగించిన చోటే మళ్లీ బోర్డులు ఏర్పాటు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామం పక్కనే ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి పక్కనే కోట్లాది రుపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించారు. గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఇటీవల కబ్జాదారులను తొలగించారు. అయితే రెవెన్యూ అధికారులు తొలగించిన చోటే మళ్లీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం. వివరాలు ఇలా ఉన్నారు. చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామ పరిసరాల్లో భూముల విలువ అమాంతం పెరిగిపోయింది. ఈ గ్రామం పరిధిలో మొత్తం 1100 ఎకరాల డీకేటీ భూములు ఉన్నాయి. డికేటీ భూములైనా సరే రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. ఈ నేపథ్యంలో రెండునెలల క్రితం కొంతమంది కబ్జాదారులు సర్వేనెంబరు 87/8 లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని చదును చేశారు. ఇక్కడ ఎకరం భూమి రూ.2 కోట్లు వరకు విలువ ఉంటుంది. రెవెన్యూ అధికారులు ఆక్రమణలను అడ్డుకొని పనులు నిలిపి వేసి అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈ భూమికి సంబంధించి ఎవరికి పట్టాలు ఇవ్వలేదు. మొత్తం భూమి అనాధీనంలో ఉంది. రెండు రోజుల క్రితం కబ్జాదారులు బోర్డులు పీకేసి జేసీబీలతో రాత్రికి రాత్రే గుంతలు తోడి మొక్కలు నాటేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం వీఆర్వో భరత్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సదరు ప్రభుత్వ భూమిలో అక్రమంగా నాటిన మొక్కలను తొలగించారు. కబ్జాదారులు తొలగించిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను మళ్లీ ఆదే స్థలంలో నాటించారు. ఇకపై ఈస్థలంలో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. అయితే కబ్జాదారులు ఇప్పటికే రెండు మార్లు బోర్డులను తొలగించి యధేచ్ఛగా ప్రభుత్వభూములను ఆక్రమించుకోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కడప అర్బన్ : సొంత పని కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో క్యాంపర్ వాహనం స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతులు ఇద్దరు బావాబామ్మర్దులు కావడంతో రెండు కుటుంబాలు విషాదంతో నిండిపోయాయి. కడప ట్రాఫిక్ ఎస్‌ఐ జయ రాములు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. కడప చలమారెడ్డి పల్లెకు చెందిన నంద్యాల రవి (32) ప్రైవేట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరుసకు బావమరిది అయిన రాయచోటి వినోద్ (26) ప్రైవేట్ ఫైనాన్స్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితమే రాయచోటి వినోద్‌కు కడపకు చెందిన యువతితో వివాహం జరిగింది. సొంత పని నిమిత్తం రవి, వినోద్ ఇద్దరు కలిసి స్కూటిలో చలమారెడ్డి పల్లె నుంచి అలంఖాన్‌పల్లెకు వెళ్లారు. తిరిగి చలమారెడ్డిపల్లెలోని తమ ఇంటికి వస్తున్న సమయంలో ఎదురుగా వేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన మహేంద్ర క్యాంపర్ వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది.